క్లుప్తంగా

సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

మహబూబాబాద్ అర్బన్: సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని మానుకోట జిల్లా కేంద్రంలోని నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు శనివారం ఎన్టీఆర్ స్టేడియాన్ని, పాత బజారులో ఉన్న నిజాం చెరువు, కొత్త బజారులో గల బంధం చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ ఉపేందర్, వార్డు కౌన్సిలర్, నాయకులు గద్దె రవి, మున్సిపల్ ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దండె శ్రీహరి పాల్గొన్నారు.

గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి



మహబూబాబాద్: బీఆర్‌ఎస్ గెలుపుకోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో శనివారం వార్డు బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. మానుకోట గడ్డపై మూడోసారి గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, గద్దె రవి, చిట్యాల జనార్దన్, వార్డు కౌన్సిలర్ బత్తుల సరస్వతి పాల్గొన్నారు.

తుమ్మలను కలిసిన నాయకులు



డోర్నకల్: మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల నాగేశ్వర్‌రావును శనివారం డోర్నకల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు ఖమ్మంలో కలిశారు. తుమ్మల కాంగ్రెస్‌లో చేరడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ డోర్నకల్ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్‌తోపాటు నాయకులు ఖాదర్‌బాబా, దోమల లక్ష్మణ్, తదితరులు శాలువాతో సన్మానించారు.

దుర్గామాతకు కరెన్సీ నోట్లతో అలంకరణ



కేసముద్రం: మండల కేంద్రంలోని ఆర్యవైశ్యభవన్‌లో శ్రీవాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను రూ.లక్ష కరెన్సీ నోట్లతో శనివారం అలంకరించారు. రూ.10 నుంచి రూ.100 కరెన్సీ నోట్లతో అమ్మవారి మండపంలో అలంకరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే



డోర్నకల్: ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపి అధికారం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని బంకట్‌సింగ్‌తండాలో శనివారం స్థానికులు సమావేశం ఏర్పాటు చేసుకుని బీఆర్‌ఎస్ పార్టీకే మద్దతు తెలపాలని తీర్మానించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలు పేదలకు మేలు చేసేవిధంగా ఉన్నాయన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎంగా రెడ్యానాయక్ ఏడోసారి ఎమ్మెల్యేగా పదవులు చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వాంకుడోత్ సుజాత, కృష్ణ పాల్గొన్నారు.

రూ.11.3 లక్షలు స్వాధీనం

మహబూబాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు ఏడుగురి నుంచి మొత్తం రూ 11.3లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్స్‌పండేచర్ మానిటరింగ్ నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎవరు కూడా రూ.50వేలను మించి నగదు తీసుకెళ్లద్దన్నారు. తీసుకెళ్లాల్సివస్తే తగిన ఆధారాలను చూపాలన్నారు. సీజ్ చేసిన వస్తువులు, డబ్బుల విషయంలో తమ అభ్యంతరాలను తగిన ఆధారాలతో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి (జిల్లా సహకార అధికారి) ఫోన్ నంబర్ 91001 15688 సంప్రదించాలన్నారు.

అభివృద్ధి ఎవరు చేశారో ఆలోచించుకోవాలి

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: పాలకుర్తి నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలు ఆలోచించుకోవాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని గుర్తూరు, చెర్లపాలెం గ్రామాల నుంచి ఆయా పార్టీలకు చెందిన పలువురు నాయకులు శనివారం మంత్రి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గంలో ప్రతి ఐదేళ్లకో కాంగ్రెస్ అభ్యర్థి మారుతున్నారని, స్థిరత్వం లేని నాయకులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేరన్నారు. రెస్ట్ లేకుండా అభివృద్ధి కోసం పాటుపడ్డానని, ఇప్పుడు గెస్ట్ లీడర్లు వస్తే ఆదరిస్తారా అని ప్రశ్నించారు. అభివృద్ధిని చూసి ప్రజలు పార్టీలో చేరుతున్నారని, 40 ఏళ్లలో జరగని అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలో పాలకుర్తిలో కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అనుమాండ్ల దేవేందర్ రెడ్డి, మేరుగు ప్రకాష్, జక్కుల రాంరెడ్డి, యాకూబ్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు రూరల్: మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు



గార్ల: మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర

ఎమ్మెల్యే హరిప్రియను మళ్లీ గెలిపించండి: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

గార్ల: ఇల్లందు ఎమ్మెల్యేగా తిరిగి బానోత్ హరిప్రియను గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మర్రిగూడెంలో జరిగిన బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ఎమ్మెల్యే హరిప్రియ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. తాను పార్టీ మారానని అంటున్నారు.. అవును నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్‌లో చేరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపించానన్నారు. నవంబర్ 1వ తేదీన ఇల్లందులో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు మండలం నుంచి రూ.10వేల మందిని తరలించాలని ఆయన సూచించారు. తొలుత గార్లలో ఎన్నికల పార్టీ కార్యాలయాన్ని ఎంపీతో కలిసి ఆమె ప్రారంభించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, మార్కెట్ చైర్మన్ హరిసింగ్‌నాయక్, ఎంపీపీ శివాజీచౌహాన్, మండల కార్యదర్శి ఉమేష్, రాధాకృష్ణ, ఎంపీటీసీలు రమేష్, కోఆప్షన్ సభ్యుడు ఎండి ఖదీర్, మురళి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కేసీఆర్ పథకాలే పార్టీని గెలిపిస్తాయి..

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ రూరల్: డోర్నకల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపునకు నాయకులు ఐక్యతతో సహకరించాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని గాలివారిగూడెంలో బీఆర్‌ఎస్ నాయకుడు చలమల నర్సింహారెడ్డి, మరిపెడ మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పానుగోతు లక్ష్మీపతిలను ఎమ్మెల్యే శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలు అండగా ఉన్నారన్నారు. నాయకులు కూడా తోడుకావాలన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే పార్టీని గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుగులోతు రాంబాబు, తేజావత్ రవీందర్‌నాయక్, కాంట్రాక్టర్ సుదర్శన్‌రెడ్డి, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

డోర్నకల్: మండలంలోని తొడేళ్లగూడెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి తాళం వేసి ఉన్నా తలుపులు తెరిచి కేంద్రంలోని 80పైగా కోడి గుడ్లను చోరీ చేశారు. శనివారం అంగన్‌వాడీ కార్యకర్త చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి గ్రామస్తులకు తెలిపింది. గ్రామానికి చెందిన యువకుడు చోరీ చేసినట్లుగా గుర్తించి అతడి వద్ద 59 కోడిగుడ్లను స్వాధీన పర్చుకుని పోలీసులకు సమాచారం అందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై శనివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. పెద్దనాగారం శివారు వస్రాంతండా జీపీ పరిధిలో వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి తల, కొంత భాగం ఛిద్రం కావడంతో గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతదేహంను తొర్రూరు అస్పత్రిలో ఉందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్టే

- హుస్సేన్ నాయక్

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్టే అని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రామచంద్రపురం, పలుకాలనీలో ఇంటింటికి హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. కొట్లాడి పోరాడి సాధించుకున్న బీఆర్‌ఎస్ సబ్బండ వర్గ ప్రజలను మోసం చేసిందన్నారు. ఓటు వేసి గెలిపించి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మానుకోట అసెంబ్లీ కన్వీనర్ సిద్ధార్థ రెడ్డి, జాటోతు మోదీన్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ సతీస్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లె సందీప్, ప్రేమ్‌రాయుడు, వెన్నేమల్ల సందీప్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న హుస్సేన్‌నాయక్

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు




వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ కృష్ణ

మహబూబాబాద్ రూరల్: ఎన్నికల నిబంధనల్లో భాగంగా మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ సీఐ చిరంజీవి, డీటీఎఫ్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో శనివారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో 50 లీటర్ల గుడుంబా, 190 కిలోల నల్లబెల్లం, 10కిలోల పటిక, వెయ్యి లీటర్ల బెల్లం పానకం, రెండు ఆటోలు, ఒక ద్విచక్రవాహనం పట్టుబడ్డాయి. దాడులకు సంబంధించి ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. మహబూబాబాద్, సీరోలు, కొరవి, బయ్యారం మండలాల పరిధిలోని దుబ్బతండా, గుజిలీ తండా, జగ్య తండా ప్రాంతాల్లో ఎక్సైజ్, డీటీఎఫ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఎస్సైలు కృష్ణమూర్తి, హనుమంతరావు, మౌనిక, హరీష్, సిబ్బంది శ్రీనివాస్, వెంకన్న, వెంకటనరసయ్య, ప్రభాకర్, నర్సింగరావు, యాదగిరి, శేఖర్, మధు పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండలంలోని గోల్‌బొడ్కతండాలో శనివారం పోలీస్, ఎక్సైజ్ శాఖ అధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. దాడులు 50లీటర్ల సారాయి, 2 క్వింటాళ్ల నల్లబెల్లం, 30కేజీల పటికతో పాటుగా 2000 లీటర్ల బెల్లం పానకంను పట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గండ్రాతి సతీష్, ఎక్సైజ్ ఎస్సై రవళి, పీసీలు శ్రీనువాసు, రమేష్, శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులను ఖండించండి

నెహ్రూసెంటర్: అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించి దుర్మార్గంగా పాలస్తీనా దేశాన్ని ఆక్రమించేలా ఉన్న ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. విచక్షణ రహిత దాడులకు పాల్పడుతున్న దేశానికి ప్రధాని మోదీ మద్దతివ్వడం సరికాదన్నారు. యుద్ధ వాతావరణ నేపథ్యంలో భారతదేశంలో పెట్రో, డీజిల్ ధరలు పెరుగుతున్నాయని, ధరల పెరుగుదల సామాన్య ప్రజలపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ సమావేశంలో భాస్కర్‌రెడ్డి, బండపల్లి వెంకటేశ్వర్లు, యాకయ్య, దొడ్డరాజు, పాషా, యాకూబ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బయ్యారం: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మండలంలోని గంధంపల్లి-కొత్తపేటలో కాంగ్రెస్ పార్టీలో చేరికల సందర్భంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇల్లందు నియోజకవర్గానికి సాగునీరందించేందుకు రోళ్లపాడు వద్ద సీఎం కేసీఆర్ చేసిన శంకుస్థాపనకు విలువ లేకుండా పోయిందన్నారు. టేకులపల్లి, ఇల్లందు, బయ్యారం, గార్ల మండలాలకు రావాల్సిన సీతారామ నీళ్లను దారి మళ్లించడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామయ్య, నాగేశ్వరరావు, ప్రవీణ్, రాంబాబు పాల్గొన్నారు.

అన్నదానం

గార్ల: గార్లలోని సమత హైస్కూల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం ఎదుట భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా గార్లలోని ఏపీఆర్ ఫంక్షన్ హాలు ఎదుట ప్రతిష్ఠించిన దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలో లిటిల్ యంగ్ డైనమిక్ అసోసియేషన్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహ సన్నిధిలో శనివారం నిర్వహించిన మహా అన్నదానంను ఎస్సై సతీష్ ప్రారంభించారు.

మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి

తొర్రూరు రూరల్: పాలనలో మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తెలిపారు. మండలంలోని పత్తేపురం, పోలెపల్లి, చీకటాయపాలెం, గోపాలగిరి గ్రామాల్లో శనివారం 'ఇంటింటికి కాంగ్రెస్-గడప గడపకు ఝాన్సమ్మ' పేరిట కాంగ్రెస్ ప్రజాసంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. గడిచిన 15ఏళ్లలో పాలకుర్తికి మంత్రి దయాకర్‌రావు చేసింది శూన్యమని, నియోజకవర్గంలో విద్యా, వైద్య వసతులు కరవయ్యాయని తెలిపారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే కాంగ్రెస్, ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి మంత్రి ఇబ్బంది పెడుతున్నాడని, కేసులకు భయపడేది లేదని, వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. పదవి లేకున్నా ప్రజా సేవ చేశానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే పాలకుర్తి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వర్‌రావు, సర్పంచ్ గూడెల్లి సోమనర్సమ్మ, నాయకులు అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, సుంచు సంతోష్, మేకల కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఝాన్సీరెడ్డి

ఉద్యమకారులను మోసం చేసిన కేసీఆర్



మాట్లాడుతున్న కృష్ణనాయక్

మరిపెడ: తెలంగాణ ఉద్యమంలో బుల్లెట్ గాయంతో కోమాలోకి వెళ్లివచ్చానని, తెలంగాణ ఉద్యమకారుడిగా తనకు డోర్నకల్ ఎమ్మెల్యేగా ఆదరించి అవకాశం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుడు, ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు, బీజేపీ మహబూబాబాద్ జిల్లా అధికార ప్రతినిధి బానోతు కృష్ణనాయక్ వేడుకున్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణనాయక్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1200 మంది బలిదానాల మీద ప్రత్యేక రాష్ట్రం వచ్చిందన్నారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ సాధించిన ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ ఉద్యకారులు మోసం చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఇక్కడ డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కూడా తన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా మార్చుకున్నాడని ఆరోపించారు. ఉద్యమకారులకు డోర్నకల్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను దరఖాస్తు పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు భూక్య కాంతమ్మ, మండల అధ్యక్షుడు బింగి రమేష్, పట్టణ అధ్యక్షుడు లింగంనాయక్, ప్రధాన కార్యదర్శి సురేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

కురవి: గుబ్బ తెగుళ్లతో పంట నష్టపోయిన మిరప రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రం శివారులో గుబ్బ తెగుళ్ల సోకిన మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఆశలతో రైతులు సాగు చేసిన మిరప తోటలకు గుబ్బ తెగుళ్ల సోకి తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఆందోళనలో ఉన్న రైతులకు ఉద్యాన శాఖ అధికారులు ఏమి పట్టించుకోవడంలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, రాజన్న, వీరన్న, కృష్ణ, శివ, అశోక్ పాల్గొన్నారు.



మిరప తోటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

సంక్షిప్త సమాచారం

బీఎస్పీ అభ్యర్థిని గెలిపించండి



గార్ల: ఇల్లందు నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థి బాదావత్ ప్రతాప్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ శనివారం గార్లలో పార్టీ నాయకులు రోడ్‌షో ద్వారా ప్రచారం నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్ మాట్లాడారు. రాష్ట్రంలో బీఎస్పీ పార్టీ అధికారం లోకి వస్తే ఆర్.ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో అవినీతి రహిత పాలన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీర వెంకన్న పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్

దంతాలపల్లి: క్రీడలతో బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్‌జీఎఫ్ తొర్రూరు జోనల్ సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో పెద్దముప్పారం గ్రామంలో మిత్రుడు ఉడుగుల ప్రవీన్ జ్ఞాపకార్థం యూవసేనా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఆయన పాల్గొన్నారు.

చీరల పంపిణీ

కేసముద్రం: మండల కేంద్రంలోని చైతన్యనగర్ కాలనీలో కోలాటం గ్రూపునకు చెందిన 25 మంది మహిళలకు, సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ శనివారం ఉచితంగా చీరలను అందజేశాడు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దామరకొండ ప్రవీణ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



డోర్నకల్: ఈనెల 25న మహబూబాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ డోర్నకల్ ఇన్‌చార్జ్ పోలెపాక ఎల్లయ్య కోరారు. స్థానిక జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద శనివారం మహారథ యాత్రకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.

క్షుద్రపూజల కలకలం

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామ శివారులో ఉప్పల మల్లయ్య శనివారం ఉదయం తోటకు వెళ్లాడు. తోటలో పిండితో బొమ్మను చేసి పసుపు, కుంకుమ, కోసిన నిమ్మకాయలు కనిపించాయి. దీంతో మల్లయ్య గ్రామస్తులకు సమాచారం అందించాడు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిని శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్వసభ్య సమావేశం

డోర్నకల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై ఎలాంటి చర్చ జరగలేదు. సమావేశానికి ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, ఎంపీడీఓ చలపతిరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు ఎన్నికల విధులు నిర్వహిస్తూ సమావేశానికి హాజరుకాకపోవడంతో సమస్యలపై చర్చ జరగలేదు.

నియోజకవర్గ యూత్ కార్యదర్శిగా మాలు



గూడూరు: మండలంలోని గుండెంగ గ్రామానికి చెందిన అజ్మీర మాలునాయక్‌ను మానుకోట కాంగ్రెస్ నియోజకవర్గ యూత్ కార్యదర్శిగా, లక్ష్మీపురం గ్రామానికి చెందిన భూక్య ప్రశాంత్‌ను యూత్ కాంగ్రెస్ సహాయ కార్యదర్శిగా ప్రకటించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చిన్నగూడూరు: మండలంలోని విస్సంపల్లి, ఉగ్గంపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ శ్యాంసుందర్ శనివారం పరిశీలించారు. కేంద్రాల వద్ద భద్రత, ఇతర వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్ మరమ్మతు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులకు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని సూచించారు.

ఆస్పత్రిలో నాగుపాము కలకలం

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల ప్రజావైద్యశాలలో శనివారం ఉదయం స్వీపర్ ఆస్పత్రి ఊడిచే సమయంలో నర్సులు స్టే చేసే గదిలో నాగుపాము కనిపించింది అతికష్టం పై పామును చంపారు. ఆస్పత్రి ఆవరణలో పుట్టలు, పిచ్చి మొక్కలు ఉన్నాయని, ఇప్పటికి పలుమార్లు పాములను చంపారని, ఇప్పటికైన ఆస్పత్రిలో గదుల తలుపులు సరిచేయాలని రోగులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చిన్నగూడూరు: మండల కేంద్రం శివారు హందాన్ (చేపూరి) తండాకు చెందిన నేతావత్ రాములు శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్ శనివారం తండాలోని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించాడు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు ఆయూబ్‌పాషా, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ ఉన్నారు.

రాష్ట్రంలో భవిష్యత్ జనసేన పార్టీదే

మరిపెడ రూరల్: రాష్ట్రంలో భవిష్యత్ జనసేన పార్టీదేనని పార్టీ డోర్నకల్ నియోజక వర్గ నాయకులు చింత రమేష్ అన్నారు. శనివారం మండలంలోని రాంపురం గ్రామంలో పలువురికి పార్టీ సభ్యత్వాలు అందజేశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు భద్రత, భరోసా కోసం రూ.5 లక్షలు ప్రమాద భీమా, ప్రమాదానికి గురైతే రూ.50 వేలు మెడికల్ పాలసీని వర్తింపజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రేక రమేష్, జలగం సందీప్, జినక రమేష్, ప్రవీన్, గుగులోతు సతీష్, మనోజ్‌కుమార్, సాగర్‌పటేల్, పాపులాల్‌నాయక్ పాల్గొన్నారు.

పోలీసు అమరులకు నివాళి



నర్సింహులపేట: మండల కేంద్రంలో శనివారం రాత్రి ఎస్సై గండ్రాతి సతీష్ అధ్వర్యంలో చౌరస్తా నుంచి పొట్టి శ్రీరాంలు విగ్రహం, శివాలయం, హైస్కూల్ సెంటర్ సెంటర్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, ఏఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని వాకింగ్ గ్రౌండ్‌లో శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, బాలూనాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

డోర్నకల్: మండలంలోని పలు మార్గాల్లో జరిగిన మూడు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది గాయపడ్డారు. గొల్లచర్ల-చిలుకోడు మార్గంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. చిలుకోడు నుంచి ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై గొల్లచర్ల వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో వేగంగా ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరితోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులంతా చిలుకోడు గ్రామానికి చెందినవారిగా తెలిసింది. వారిని చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించారు. డోర్నకల్ సమీపంలోని సమ్మర్ స్టోరేజి సమీపంలో ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు కాగా స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ముల్కలపల్లి వద్ద స్కూటీ వాహనం అదుపు తప్పిపడటంతో లూనావత్ కిషన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.